క్లుప్తంగా

ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి



నారాయణ స్కూల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకుల నిరసన

రాయదుర్గంటౌన్: ప్రైవేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న ఎంఈఓ నాగమణిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అంజనేయులు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఇతర సామగ్రి మొత్తం కొనుగోలు చేయాలని తల్లిదండ్రులకు ఒత్తిడి చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం పట్టణంలోని నారాయణ స్కూల్‌లో స్టేషనరీ విక్రయిస్తున్న విషయం తెలుసుకుని అడ్డుకున్నట్లు తెలిపారు.

కూరగాయల వ్యాపారుల నూతన కమిటీ ఎంపిక



కూరగాయల వ్యాపారుల కమిటీ సభ్యులు

ఉరవకొండ: స్థానిక గవిమఠం ఆవరణలో కూరగాయల వ్యాపారుల నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షులు అయ్యవరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఓబుళేసు, కార్యదర్శిగా మల్లన్న, కోశాధికారిగా కృష్ణ, గౌరవాధ్యక్షులుగా ఓబుళేసు, సభ్యులుగా నిమ్మకాయల వెంకటేసులు, శాంతి, మారెక్క, నారాయణస్వామి ఎంపికయ్యారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏఐఎస్‌ఎఫ్ కార్యవర్గ సభ్యుడు హనుమంతరాయుడు అన్నారు. మంగళవారం ప్రభుత్వ సాంఘింక సంక్షేమ హాస్టళ్ల సందర్శనలో భాగంగా పట్టణంలోని బాలికల కేజీబీవీని సందర్శించారు. అనంతరం హాస్టళ్లను పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు హర్షవర్ధన్, సహాయ కార్యదర్శి రాంబాబు, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

బొమ్మనహాళ్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరంలో 232 మంది, ద్వితీయ సంవత్సరంలో 250 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీఎస్ రాయుడు, హనుమంతనాయక్, ఆదిరాముడు, శంకర్‌లింగ, వరలక్ష్మీ, స్వప్న, గంగిరెడ్డి, భూపతి, పుష్పరాజ్, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు బంగారు భవిష్యత్ ఇవ్వండి



రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

కూడేరు: భవిత కేంద్రాలకు వచ్చే ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన విద్యనందించి విద్యావంతులుగా తీర్చి బంగారు భవిష్యత్ పొందేలా చూడాలని సమగ్ర శిక్షా జిల్లా సహాయ ఐఈడీ కోఆర్డినేటర్ ఎంకే షామా సూచించారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చే పిల్లల హాజరు రిజిష్టర్, ఇతర రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఫిజియోథెరపిస్టు రమేష్ రెడ్డి, ఐఈఆర్టీలు మస్తానయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెండర్లు

ఉరవకొండ: ఉరవకొండ పంచాయతీ కార్యాలయంలో మేజర్ గ్రామ పంచాయతీ ఆదాయ వనరులకు సంబంధించి సోమవారం నిర్వహించిన టెండర్లు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. దినసరి మార్కెట్‌కు సంబంధించి గోవిందు అనే వ్యక్తి రూ.8.90 లక్షలకు, బస్టాండ్‌కు సంబంధించి పెన్నయ్య అనే వ్యక్తి రూ.4.45 లక్షలకు, కసాయి అంగళ్లకు సంబంధించి శ్రీనివాసులు అనే వ్యక్తి రూ.4.69 లక్షలకు, గొర్రెలు, మేకల మార్కెట్‌ను కేశవనాథ్ రూ.4,85,500, పాయిఖానాను పెన్నయ్య రూ. 2,02000 దక్కించుకున్నాడు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఈఓ గౌస్ సాహెబ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గంబూసియా చేపలతో దోమల నిర్మూలన

బెళుగుప్ప: గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న కుంటల్లో దోమలు వృద్ధి చెందకుండా గంబూసియా చేపలను వదలాలని ఎంపీడీఓ సుబ్బరాజు, మండల వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామం అనుకునే ఉన్న దుగ్గేమ్మ చెరువులో దోమలు వృద్ధి చెందకుండా గంబూసియా చేప పిల్లలను స్థానిక ప్రజా ప్రతినిదులతో కలిసి అధికారులు చెరువులో వదిలారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నమ్మ, ఈఓఆర్‌డీ మాధవరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, మాజీ వైస్ ఎంపీపీ తిమ్మప్ప, సచివాలయ అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కపై తగ్గుతున్న మక్కువ

- నర్సరీల్లో కూరగాయల మొక్కలకు తగ్గిన డిమాండ్
- కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న నర్సరీలు
- వర్షాభావంతో తగ్గిన భూగర్భ జలాలు
- బోర్ల కింద అరకొరగా పంటల సాగు
- మొక్కలు దెబ్బతిని నష్టపోతున్నామంటున్న నిర్వాహకులు



కూడేరు వద్ద నర్సరీలో పెంచుతున్న టమాట, మిరప మొక్కలు

కూడేరు: వర్షాధారం కింద సాగు చేసే వేరుశనగ తర్వాత అదే స్థాయిలో బోరుబావుల కింద ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు మక్కువ చూపుతారు. రెడీమేడ్‌గా నర్సరీల్లో దొరికే మొక్కలు కొనుగోలు చేసి, నాటుతారు. ఖరీఫ్ సీజన్‌లో మే నెల నుంచి ఆగస్టు నెల వరకు ఎక్కువగా కూరగాయల పంటలు సాగు చేస్తారు.అయితేవర్షాభావంతో భూగర్భ జలాలు అడుగంటాయి. ఫలితంగా వ్యవసాయ బోర్లలో నీటి లభ్యత ఘననీయంగా తగ్గి పోయింది. దీంతో బోర్ల కింద కూరగాయల పంటల సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. ప్రస్తుతం కూరగాయల మొక్కలు కొనుగోలు చేసేవారు లేక నర్సరీలు వెలవెలబోతున్నాయి. రెండు నుంచి మూడు ఎకరాల్లో కూరగాయల పంటలు సాగు చేసే రైతులు విద్యుత్ సరఫరా, బోర్లలో నీటి లభ్యతను బట్టి అర ఎకరా లేదా ఎకరాలోపు సాగు చేస్తున్నాడు.

మార్కెట్లో ఆకాశన్నింటిన కూరగాయల ధరలు : మార్కెట్లో గత రెండు నెలలుగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. కిలో టమాట, పచ్చి మిరప, ఉల్లిగడ్డలు రూ.100 దాటాయి. మిగిలిన కూరగాయలు కిలో రూ.40 నుంచి 60 వరకు పలుకుతున్నాయి.

నర్సరీల్లో జోరుగా కూరగాయల మొక్కల సాగు:

మార్కెట్లో కూరగాయలకు ఉన్న ధరను చూసి రైతులు ఎక్కువగా కూరగాయల పంటలు సాగు చేస్తారని నర్సరీ నిర్వాహకులు అధికంగా మొక్కల సాగును చేపట్టారు. కానీ నీటి కొరతతో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తే నష్ట పోవాల్సి వస్తుందని రైతులు పంటల సాగుకు సిద్ధపడడం లేదు. దీంతో నర్సరీల్లో కూరగాయల మొక్కలకు డిమాండ్ తగ్గిపోయింది. కొనుగోలుదారులు లేక నర్సరీలు వెలవెలబోతున్నాయి. టమాట మొక్క మొలిచాక 25 నుంచి 30 రోజుల్లోపు, మిరప 35 నుంచి 40 రోజులు, వంకాయ, ఇతర మొక్కలు 25 నుంచి 30 రోజుల్లో నాటేందుకు కాల పరిమితి ఉంటుంది. ఆ తర్వాత ఆ మొక్కలు పనికి రావు. టమాట, మిరప, వంకాయ ఇతర కూరగాయలకు చెందిన లక్ష మొక్కలు సాగు చేయాలంటే దాదాపుగా రూ.20 నుంచి 25 వేలు వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. అదే సాహో టమాట అయితే లక్ష మొక్కల సాగుకు సుమారు రూ.50 వేలు వరకు పెట్టుబడి అవుతుంది. చిన్న నర్సరీల్లో సీజన్‌లో సగటున సుమారు 8 నుంచి 10 లక్షలు మొక్కలు, పెద్ద నర్సరీల్లో సుమారు 10 నుంచి 15 లక్షల మొక్కల వరకు సాగు చేస్తారు. జూన్ మాసంలో తుఫాను ప్రభావంతో చిరుజల్లుల వర్షం కొన్ని రోజులు పాటు పట్టుకోవడంతో నర్సరీల్లో సాగవుతున్న కూరగాయల మొక్కలు దెబ్బతిన్నాయి. మరో పక్క మొక్కల కాలపరిమితి దాటిపోవడంతో నిర్వాహకులు వాటిని పడేశారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో నర్సరీల వివరాలు..

నియోజకవర్గం పేరు	నర్సరీల సంఖ్య
ఉరవకొండ	75
కళ్యాణదుర్గం	80
రాయదుర్గం	85

రూ.లక్ష వరకు నష్టపోయా



ఈ ఏడాది ఖరీఫ్‌లో కూరగాయలకు ధర ఎక్కువ పలుకుతుంటే ఎక్కువ మంది రైతులు సాగు చేస్తారని లక్షల్లో టమాట, మిరప, వంకాయ ఇతర కూరగాయల మొక్కలు సాగు చేశాం. కానీ రైతులు కూరగాయల మొక్కలు కొనడానికి ముందుకు రాలేదు. మొక్కల కాలపరిమితి దాటిపోవడంతో లక్షల్లో మొక్కలు దెబ్బతిన్నాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వచ్చింది. నర్సరీలో ఇంకా మిరప, టమాట మొక్కలు లక్షల్లో ఉన్నాయి. ఏమి చేయాలో అర్థం కావడం లేదు.

– రాఘవేంద్ర, సంగమేశ్వర నర్సరీ నిర్వాహకుడు, కూడేరు

నర్సరీ నిర్వహణ భారమైంది



నర్సరీలు ఎక్కువయ్యాయి. కూరగాయల మొక్కల కొనుగోలుదారులు తగ్గిపోయారు. స్థలాలు లీజుకు తీసుకొని నర్సరీ నిర్వహిస్తున్నాం. మొక్కల సాగుకు పెట్టుబడి కూడా రెట్టింపయ్యింది. రైతులు తక్కువ ధరకు అడుగుతారు. గత నెలలో కురిసిన చిరుజల్లులకు సుమారు 3 లక్షల మొక్కలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు లక్షల్లో మొక్కలు సాగు చేశాం. కాల పరిమితి దగ్గర పడుతోంది. రైతులు కొనడానికి ముందుకు రాకపోతే అవి కూడా దెబ్బతింటాయి. రూ.లక్షల్లో నష్ట పోవాల్సి వస్తుంది. నర్సరీ నిర్వాహణ

– అంజనప్ప, శ్రీఆంజనేయం నర్సరీ నిర్వాహకుడు , కూడేరు.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న సమన్వయ కర్త తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటామని కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ ప్రజాసామ్యంలో గెలుపోటములు సహజం అని, గెలిచిన పార్టీ కక్ష పూరితంగా పాలన చేయకుండా ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలని తెలియజేశారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా ప్రభుత్వం పాలన సాగించాలని అన్నారు. ఎన్నికల్లో గెలవటం కోసం సాధ్యంకాని హామీలు ఇచ్చి, ఇప్పుడు వాటిని అమలుచేయకుండా రాష్ట్రంలో హత్యారాజకీయాలను పోత్రహించడం ఎంతవరకు సమంజసం అన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి కంటే మెరుగైన పాలన అందిస్తానని చంద్రబాబునాయుడు హామీలు ఇచ్చి, నేడు వాటిని అమలు చేయడంలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బోయతిప్పేస్వామి, బ్రహ్మసముద్రం ఎంపీపీ చంద్రశేఖర్, అక్కమ్మగార్ల ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కిరిటీ యాదవ్, నాయకులు దేవన్న, గోపాల్, హనుమంతురాయుడు, నాగరాజు, బేరిల్లరాజు, జాని, రామిరెడ్డి, తలారి శ్రీకాంత్, మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. అధైర్యపడకండి



బేలోడు వద్ద కార్యకర్తలతో మాట్లాడుతున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

గుమ్మఘట్ట: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని, పార్టీ కోసం పని చేస్తున్న ప్రతి సైనికుడికీ భరోసా కల్పిస్తున్నట్లు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. మండలంలోని బేలోడు గ్రామ సమీపంలో మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సాగు చేసిన వివధ పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి రాబోవు రోజుల్లో గడ్డుకాలం తప్పదని అన్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన అమాయకులపై దౌర్జ న్యాలు, హత్యలు చేస్తూ భయబాంత్రలకు గురిచేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని తెలిపారు. దౌర్జన్యాలకు, తాటాకు చప్పళ్లకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని అన్నారు. పగటిపూటే మహిళలు రోడ్డుపై తిరిగేపరిస్థితి లేకుండా టీడీపీ నాయకులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బేలోడు సర్పంచ్ ఉమేష్ రెడ్డి, నాయకులు బేలోడు రామాంజనేయులు, జయరామిరెడ్డి, ఖాసిం,రామాంజనేయులు, వెంకటేశులు, శీన, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరం



కళ్యాణదుర్గంలో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సుభాన్



ఉరవకొండలో పోస్టర్లను విడుదల చేస్తున్న ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి

కళ్యాణదుర్గం: అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సుభాన్ తెలిపారు. మంగళవారం స్థానిక స్థానిక ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ సమాజంలో మానవ అక్రమ రవాణా అధికమైందన్నారు. చాలా చోట్ల మహిళలను వ్యభిచార కూపాల వైపు మళ్లిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. చిన్నారులను వికలాంగులను చేసి భిక్షమెత్తుకునేలా చేస్తున్నారని గుర్తుచేశారు. ఏదైనా ఆపద, అన్యాయం జరిగితే వెంటనే 100 డయల్ చేయాలని సూచించారు. న్యాయవాదులు పార్థసారథి, దాదా ఖలందర్, తిమ్మప్ప, పట్టాభి, రామ్మూర్తి, ఎస్ఐ వెంకటస్వామి పాల్గొన్నారు.

ఉరవకొండ: వ్యక్తుల అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని ఉరవకొండ ఫస్ట్‌క్లాస్‌మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి అన్నారు. సోమవారం ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ కోర్టు ప్రాంగణంలో ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి ఆధ్వర్యంలో వ్యక్తుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ రమాదేవి, వెలుగు ఏపీఎం శివయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఆర్డీటీ టీంలీడర్ నల్లప్పరెడ్డి పాల్గొన్నారు.

హజరత్ పీరాషావలీ ఉరుసు ప్రారంభం



పీర్లకు చక్కెర చదివింపులు చేస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామంలో కులమతాలకతీతంగా మూడు రోజుల పాటు జరిగే హజరత్ పీరాషావలి ఉరుసు మంగవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు హజరత్ పీరాషావలి దర్గాలో గంధం కార్యక్రమం జరిగింది. ఖాసీం, అంజినప్ప ఇంటి నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి పీరాషావలి సమాధికి సమర్పించి, పూల చద్దార్‌ను పరిచారు. అనంతరం చెక్కరతో ఫాతేహాలు చేయించారు. బుధవారం రాత్రి ఉరుసు, గురువారం జియారత్ కార్యక్రమం జరుగనున్నట్లు ఆలయ ధర్మకర్త పూలరంగన్న తెలిపారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

కూడేరు: మండలంలోని అరవకూరు, కడదరకుంట, కూడేరులో పానకాల ఉత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో మరువలో పానకాన్ని మంగళ వాయిద్యాల నడుమ పీర్ల మసీదు వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ గుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తర్వాత పీర్ల దేవుళ్లకు చక్కెర, బెల్లం చదివింపులు చేయించారు. ముజావర్లు పీర్ల దేవుళ్లకు ప్రత్యేక పూజలు చేయించి,చక్కెర చదివించారు.

హంద్రీనీవాకు కృష్ణా జలాలు విడుదల చేయాలి

- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల నాగేశ్వరరావు

వజ్రకరూరు: హంద్రీనీవా సుజల స్రవంతి పథకానికి కృష్ణజలాలను వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు ఉరవకొండ ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగ పంటతో పాటు ఆముదం, కంది సాగు చేసినట్లు తెలిపారు. వర్షాభావంతో పంటలు ఎండుముఖం పట్టాయన్నారు. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు చేరిందని, దీంతో జలాశయం నిండుగా ఉందన్నారు. వరదనీరు పెరగడంతో అధికారులు గెట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.పంటపెట్టుబడి కింద రైతులకు అందించాల్సిన రైతు భరోసా సాయాన్ని కూడా ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో టీడీపీ నేతలు దౌర్జన్యానికి దిగారు. బీజేపీ నేత కాపు రామచంద్రారెడ్డికి చెందిన కంకర క్వారీ నుంచి వెళ్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. రోడ్డుకు అడ్డంగా గంటల తరబడి ద్విచక్ర వాహనాలు ఉంచారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. పేరుకే కూటమి ప్రభుత్వం..కానీ బీజేపీ, జనసేనకి రాయదుర్గంలో తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆ పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నాయకుల ఆగడాలు, దౌర్జన్యాలు రోజు రోజుకూ మితిమీరి పోతున్నాయని మండిపడ్డారు. రెడ్‌బుక్ రాజ్యాంగం మానుకుంటే మంచిదని హితవుపలికారు. దౌర్జన్యాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని బీజేపీ నాయకులు తెలిపారు.

నాణ్యతలేని మటన్ విక్రయిస్తే చర్యలు

రాయదుర్గం: పట్టణంలోని మటన్, చికెన్, చేపల విక్రయాల్లో నాణ్యత పాటించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు చేపట్టాల్సి వస్తోందంటూ వ్యాపారులను మున్సిపల్ కమిషనర్ కిశోర్ హెచ్చరించారు. మంగళవారం 'సాక్షి' లో 'ప్రజారోగ్యంతో చెలగాటం' శీర్షికన కథనం ప్రచురితమైంది. అందుకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సిబ్బందితో కలసి మార్కెట్ ప్రాంతాన్ని సందర్శించారు. మార్కెట్ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్‌ను ఆదేశించారు. అనంతరం వ్యాపారులకు పలు సలహా, సూచనలు చేశారు. మాంసంపై ఈగలు, దోమలు వాలినట్లు గుర్తిస్తే, తామే కాలువలో పడేస్తామని హెచ్చరించారు.

పాఠశాల అభివృద్ధికి విరాళాలు



దాతలను సన్మానిస్తున్న దృశ్యం

కంబదూరు: మండలంలోని నూతిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందించాలన్న ఉద్దేశంతో పూర్వ విద్యార్థులు వారికి తోచిన విధంగా చేయూతనందిస్తున్నారు. వైసీపల్లిలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సుధాకర్ (1989–90)పూర్వ విద్యార్థి రూ.40 వేలు అందించారు. రైల్వేలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గాజుల రామ్మోహన్ రూ.15 వేలు, కాంట్రాక్టర్ మంగళకుంట నరసింహులు రూ.10 వేలు, యరిడికెర ఉపాధ్యాయుడి బాలరామ్మోహన్ రూ.10 వేలు, రాళ్లపల్లి ఉపాధ్యాయుడు గురుమూర్తి రూ.5 వేలు, ఆగస్టు 15న విద్యార్థులకు అందించే బహుమతులకు అయ్యే రూ.15 వేల ఖర్చును సుధాకర్ అనే పూర్వ విద్యార్థి అందిస్తానని ముందుకొచ్చారు. అనంతరం దాతలను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



దేవగిరి క్రాస్‌లో అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని పీహెచ్‌సీ వైద్యులు శ్రీలక్ష్మీ, మల్లీశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని దేవగిరి క్రాస్ గ్రామంలో డెంగీ నివారణ, దోమలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

వజ్రకరూరు: మొక్కలు పెంచితేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సర్పంచు మల్లెల జగదీష్ అన్నారు. మంగళవారం మండలంలోని చాబాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. సర్పంచు మల్లెల జగదీష్,హెచ్‌ఎం నాగేంద్రప్ప తదితరులు మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్రప్ప, పీడీ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేసినట్లు ఎంఈఓ-2 వెంకటరమేష్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మొదటి, ద్వితీయ సంవత్సరానికి చెందిన దాదాపు 594 మంది విద్యార్థులకు విద్యా కిట్లను ఎంఈఓ-2తో పాటు ప్రిన్సిపాల్ విజయభాస్కర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జ్ఞానేశ్వర్, లైబ్రేరియన్ వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలన్నారు.

సంక్షిప్త సమాచారం

బెళుగుప్ప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వ సభ్యసమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు ఓ ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలు చేస్తే జైలు



కుందుర్పిలో మాట్లాడుతున్న సీడీపీఓ వనజా అక్కమ్మ

కుందుర్పి: బాల్య వివాహాలు నేరం..బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా తప్పదని సీడీపీఓ వనజా అక్కమ్మ, ఆర్డీటీ మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ, ఎంఈఓ తిప్పేస్వామిలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వడ్డే పాల్యంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ-మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాలు అరికడదాం- ఆడ బిడ్డలను కాపాడుదాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరైనా, ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తుంటే 1098, 100,112కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుశీలమ్మ,హెచ్‌ఎం సూర్యనారాయణ పాల్గొన్నారు.

గలగలలో ఓళిగమ్మ పండుగ

గుమ్మఘట్ట: మండలంలోని గలగల గ్రామంలో ఓళిగమ్మ పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇంటిల్లిపాది గ్రామ దేవత మారెమ్మకు ఓళిగలను నియమనిష్టలతో తయారుచేసి, నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం రూరల్: దళితుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సాకే గురుమూర్తి అన్నారు. మంగళవారం సత్యసాయి జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడుల వెంటనే ఆపాలని కోరారు. నాయకులు చాంద్ బాషా, అనంపల్లి రామన్న, బాబు, శెట్టూరు, కంబదూరు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తిప్పేస్వామి, గంపల రామాంజనేయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

వజ్రకరూరు: సమస్యలను పరిష్కరించాలని మంత్రి పయ్యావుల కేశవ్‌ను విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మంత్రిని పామిడి సెక్షన్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు కలసి వినతిపత్రం అందించారు. కాంట్రాక్ట్ కార్మికులు నారాయణస్వామి, సుదర్శన్‌బాబు, అజయ్ కుమార్, నాగరాజు, దేవేంద్రనాయక్, షెక్షావలి, ఎర్రిస్వామి, కుమారస్వామి, నరసింగరావు,ఇం ద్రకుమార్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బొమ్మనహాళ్: మండలంలోని కల్లుదేవనహళ్లి వేదావతి హగరి నది నుంచి మంగళవారం ఉదయం ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని సింగానహళ్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఎన్. వన్నూరుస్వామిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పింఛన్లు సజావుగా పంపిణీ చేయాలి

గుమ్మఘట్ట: ఆగస్టు ఒకటో తేదీన పింఛన్లను సజావుగా పంపిణీ చేయాలని ఎంపీడీఓ గౌరీదేవి తెలిపారు. మండలంలోని 75 వీరాపురం, పూలకుంట, తాళ్లకెర, బీటీపీ గ్రామ సచివాలయాల్లో రికార్డులను ఆమె పరిశీలించారు. విధులకు సక్రమంగా హాజరు కాకపోయినా, ప్రజల వినతులు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. పింఛన్ల పంపిణీకి అన్ని రకాలు చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు.



